భక్తిశ్రద్ధలతో వసంత పంచమి





కారంచేడులో ప్రత్యేక అలంకరణలో గ్రామ దేవత గంగమ్మతల్లి, హరేరామ ఆశ్రమంలో సరస్వతీదేవి పూజల్లో భక్తులు



సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న పాఠశాల ప్రిన్సిపల్

● చిన్నారులకు అక్షరాభ్యాసాలు

కారంచేడు: వసంత పంచమి పర్వదిన్నాన్ని పురస్కరించుకొని సరస్వతీదేవికి ఎంతో ప్రీతికరమైన రోజును కనులపండువగా నిర్వహించారు. స్థానిక పుట్టాయిపాలెంలో కొలువైన గ్రామ దేవత గంగమ్మ తల్లి గుడి వద్ద, కాలువ సెంటర్ సమీపంలోని హరే రామ ఆశ్రమంలోనూ వసంత పంచమి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మ గుడి వద్ద ఉదయం నుంచి గ్రామస్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. హరేరామ ఆశ్రమంలోనూ భక్తులు పెద్ద ఎత్తున సరస్వతీదేవి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో పూజలు చేసిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అద్దంకి రూరల్: వసంత పంచమిని పురస్కరించుకొని స్థానిక మహాత్మాగాంధీ యూపీ పాఠశాలలో ప్రిన్సిపాల్ జి. వీరబ్రహ్మం ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు పలకలు, బిస్కెట్లు, సరస్వతి దేవి ప్రసాదం పంచిపెట్టారు. కార్యక్రమంలో చిన్నారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థికంగా వృద్ధి సాధించాలి

చీరాల టౌన్: స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా వృద్ధి చెందాలని ఏపీఎం మధుబాబు అన్నారు. స్థానిక బుర్లవారిపాలెంలోని స్త్రీ శక్తి భవనంలో మండల సమాఖ్య సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకోవడంతో పాటుగా మొబైల్ బుక్ కీపింగ్‌ను నిర్వహించాలని సూచించారు. పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని జీవనోపాధిని పెంచేలా పొదుపు సంఘాల వీవోఏలు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రూపు విధిగా ప్రతినెల 10తేదీ సమావేశాన్ని నిర్వహించుకుని గ్రూప్‌ల మొబైల్ కీపింగ్‌ను 100శాతం పూర్తి చేయాలన్నారు. స్త్రీనిధి రికవరీలు పూర్తిగా వసూళ్లు చేయాలన్నారు. ప్రతి గ్రూపు తీసుకున్న రుణాలను కేవలం స్వయం సహకారం పెంపొందించుకునే సంస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పొదుపు గ్రూపులు రుణాల చెల్లింపులో అలసత్వం వీడాలన్నారు. ఉన్నతి పథకం చెల్లింపులు సకాలంలో చేసేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో మండల సమాఖ్య ప్రతినిధులు, వీఓఏలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు కల్యాణ వార్షికోత్సవం

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సంతమాగులూరు మండలం చవిటిపాలెంలో భద్రావతి సమేత భావనఋషి స్వామి దేవస్థానంలో మంగళవారం స్వామి అమ్మవార్లు 18వ వార్షిక కళ్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

అర్జీల విచారణ వేగవంతం చేయాలి

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాసు పుస్తకాలు, రెవెన్యూ అజమాయిషీ, అర్జీలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు సత్వర ప్రభుత్వ సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో, సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు అర్జీలను త్వరగా విచారించాలన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు తమకు కేటాయించిన విధుల్లో అలసత్వం వహిస్తే వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలను త్వరగా అందించడంతో పాటుగా గ్రామాల్లో ఎక్కడా కూడా అనధికార లే అవుట్లు వేయకుండా కట్టడి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ డి.అర్జున్, వీఆర్వోలు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



కొత్తూరులో మాట్లాడుతున్న కృష్ణబాబు

బల్లికురవ: గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు అన్నారు. మండలంలోని కొత్తూరు పంచాయతీలోని అరుణగిరి తండాలో సోమవారం కార్యకర్తలతో మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయిందన్నారు. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకపోవడంతో ప్రజలంతా ప్రభుత్వంపై ఎంతో కోపంగా ఉన్నారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆందోళనను ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా వేసినట్లు తెలిపారు. ప్రభుత్వంపై హామీల అమలుకు పోరాడేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. ఈయన వెంట మండల ఉపాధ్యక్షుడు ఇప్పల వెంకటసుబ్బారెడ్డి, హింసావత్ కిషోర్ నాయక్ తదితరులు ఉన్నారు.

పరిమితికి మించి ప్రయాణం ప్రమాదకరం



కూలీలకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

అద్దంకి రూరల్: ఆటోల్లో, చిన్నట్రాలీ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణించటం ప్రమాదకరమని సీఐ సుబ్బరాజు అన్నారు. స్థానిక భవానీ సెంటర్‌లో సోమవారం పరిమితికి మించి కూలీలతో ప్రయాణిస్తున్న మిని లారీని ఆపి కూలీలను దించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కూలీలను బస్టాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో సీఐ, ఎస్సై పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మీనారాయణ

యద్దనపూడి: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఇంటిపన్నులను నూరుశాతం వసూలు చేయాలని సూచించారు. రక్షిత మంచి నీటి పథకాల ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది కార్యాలయాల్లో అందుబాటులో ఉండి ప్రజలకు సత్వర సేవలందేలా చూడాలన్నారు. ఈఓఆర్డీ కృష్ణ, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

● వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదనరెడ్డి



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న సమన్వయకర్త గాదె మధుసూదనరెడ్డి

ఇంకొల్లు(చినగంజాం): నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదనరెడ్డి అన్నారు. ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలోని ఆయన స్వగృహంలో చినగంజాం మండలం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఓర్పు, సహనంతో ముందుకు సాగాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి అందరం ఐక్యంగా ఉండి కృషి చేద్దామన్నారు. కార్యకర్తలకు అధైర్య పడాల్సిన అవసరం లేదని, అండగా ఉండి పార్టీని ముందుకు నడిపిస్తానన్నారు. అనంతరం ఫీజుపోరు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి, కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీలు కొండూరి గోవింద్, యల్లావుల తిరుపతిరావు, కేవీ సుబ్బారావుచౌదరి, పాదర్తి ప్రకాష్, కొల్లాటి ఏడుకొండలు, మేడికొండ సునీల్, కేవీ రమణారెడ్డి, వీవీఆర్ ప్రసాద్, సూరి, ఉమ, మారెళ్ల రామకృష్ణ, మాచవరపు రవికుమార్, కాపులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలేటి, పోలీసులకు మధ్య వాగ్వాదం

● ఎన్టీఆర్ విగ్రహ నిర్మాణ భూమిపూజ సందర్భంగా



పాలేటి రామారావుతో మాట్లాడుతున్న ఒన్‌టౌన్ సీఐ

చీరాల: చీరాల గడియారస్తంబం సెంటర్‌లో సోమవారం రాత్రి హైటెన్షన్ నెలకొంది. చీరాల నడిబొడ్డున ఉన్న గడియార స్తంభం ప్రాంతంలో అందరూ ఎవరి పనుల్లో వారు నిమగ్నమై ఉండగా ఒక్కసారిగా ఎన్‌టీఆర్ విగ్రహ నిర్మాణానికి సంబంధించి భూమి పూజ కార్యక్రమమంటూ బాణాసంచా కాల్చడంతో ఏం జరుగుతుందోనని తెలియలేదు. మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు మరికొందరు గడియార స్తంభం సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమానికి మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ జైసన్ బాబు, మరికొందరు కౌన్సిలర్లు హాజరయ్యారు. ముందస్తు సమాచారం లేకుండా భూమిపూజ కార్యక్రమం ఏంటని పోలీసులు ప్రశ్నించారు. దీంతో మాజీ మంత్రి పాలేటి రామారావుకు, పోలీసులకు మధ్య కొద్దిపాటి వాగ్వాదం చోటుచేసుకుంది. అయితే విగ్రహ నిర్మాణానికి సంబంధించి మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపిందని, అందుకే తాము విగ్రహ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించామని చెప్పారు. విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే, ఎంపీలను ఆహ్వానిస్తామని బదులిచ్చారు. రాత్రి సమయంలో భూమి పూజ కార్యక్రమం నిర్వహించడంతో ఏం జరుగుతుందోనని అందరూ చర్చించుకున్నారు.

మధుసూదన్‌రెడ్డిని కలిసిన చల్లా



గాదె మధుసూదనరెడ్డిని కలిసిన రామయ్య

ఇంకొల్లు(చినగంజాం): వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె మధుసూదన్‌రెడ్డిని పార్టీ దివ్యాంగుల విభాగం బాపట్ల జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని పావులూరులో ఆయన స్వగృహంలో కలిసి బొకే అందజేసి సత్కరించారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో దివ్యాంగుల మండల కమిటీలను నియమించాలనికోరారు. అందరం కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని మధుసూదన్‌రెడ్డి తలిపారు. కార్యక్రమంలో కొమెర శ్రీను, కత్తుల తిరుపతయ్య, జంద్రాజుపల్లి పేరయ్య, డి.వెంకటేశ్వర్లు, తూళ్లూరు వెంకటేశ్వరరావు, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఛలో హైదరాబాద్ విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కారంచేడు: ఎస్సీ కులాల వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ పిలుపు మేరకు ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగే 'లక్ష డప్పులు–వేల గొంతులు' కార్యక్రమానికి మాదిగలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని సంఘ బాపట్ల జిల్లా అధ్యక్షుడు బుడంగుంట్ల లక్ష్మీనర్సయ్య పిలుపునిచ్చారు. కారంచేడులో వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించి మండలంలోని అనేక గ్రామాల నుంచి వచ్చిన మాదిగ ఐక్య పోరాట నాయకులతో మాట్లాడారు. దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో జరగనున్న అతిపెద్ద సాంస్కృతిక కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగలు, డప్పు కళాకారులు, జానపద కళాకారులు, గేయ రచయితలు, కవులు, సినీ దర్శకులు, మేధావులు, అన్ని వర్గాల వారు ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో జంద్రాజుపల్లి నాగరాజు, తేళ్ళ పుల్లరాజు, కట్టెంపూడి యోహాను, దుడ్డు మోషే, తేళ్ల ఏరువాక, పునేష్‌లు పాల్గొన్నారు.

సామాజిక సేవకుడు పంతంగి జ్యోతయ్య మృతి



పంతంగి జ్యోతయ్య (ఫైల్)

అద్దంకి రూరల్: సామాజిక సేవకుడు పంతంగి జ్యోతయ్య (75) సోమవారం మృతి చెందారు. ఇటీవల అనారోగ్యంగా ఉండటంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం బెంగుళూరు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. జ్యోతయ్య మాజీసైనికోద్యోగి, కొంత కాలం అద్దంకి స్టేట్ బ్యాంకులో గార్డుగా పనిచేశారు. అద్దంకి పట్టణంలోని రోడ్డు పక్కన, పలు చోట్ల స్వచ్ఛదగా మొక్కలు నాటి వాటికి ప్రతిరోజు నీటిని పోసి పెంచి పోషించేవారు. పేదలు నివసించే కాలనీలకు రిక్షా తొక్కుకుంటూ వెళ్లి దుస్తులు పంచిపెట్టేవారు. కరోనా సమయంలో దాతల సహకారంతో రిక్షా బండిపై తిరుగుతూ నిరాశ్రయులైన వారికి భోజనాన్ని అందించి పలువురి ప్రశంసలు అందుకున్నారు. అలాగే పట్టణంలోని నర్రావారిపాలెంలోని స్మశానాన్ని బాగు చేశారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి



పార్కులు మొక్కలు నాటుతున్న రోటరీక్లబ్ సభ్యులు

అద్దంకి రూరల్: మొక్కలు నాటి పర్యావరణ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని రోటరీక్లబ్ సింగరకొండ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అన్నారు. సోమవారం క్లబ్ ఆధ్వర్యంలో రోటేరియన్ కొల్లిపర నాగయ్య సౌజన్యంతో స్థానిక వేలమూరిపాడు రోడ్డులోని పంచముఖ అంజనేయ దేవస్థానం పక్కన ఏర్పాటు చేసిన పార్కులో 35 రకాల పూలు, పండ్ల మొక్కలు నాటారు. సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, మలాది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, జ్యోతి చంద్రమౌళి, కొల్లి సురేంద్ర, మన్నం త్రిమూర్తులు, కొల్లా భువనేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో పంగులూరు ఎడ్ల సత్తా

జె.పంగులూరు: పాత గుంటూరు జిల్లా నాదెండ్లలో విశ్వేశ్వర స్వామి వార్షికోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీల్లో పంగులూరు ఎడ్లు సత్తా చాటి రెండో స్థానంలో నిలిచాయి. పంగులూరుకు చెందిన చిలుకూరి నాగేశ్వరరావు ఎడ్లు పోటీలో 10 క్వింటాళ్ల రాయిని 15 నిముషాల్లో లాగి ద్వితీయస్థానంలో నిలిచాయి.



బండ లాగుతున్న పంగులూరు ఎడ్లు

పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలి

చీరాల టౌన్:

పంచాయతీ కార్యదర్శులు విధులు సమర్థవంతంగా నిర్వహించి గ్రామ పంచాయతీలను అభివృద్ధిలో ముందంజలో ఉంచాలని ఎంపీడీఓ పి.శివసుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల కార్యదర్శులు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామ సచివాలయాలను తనిఖీలు చేసి పెండింగ్ అర్జీలను విచారించినట్లు తెలిపారు. ప్రజలు ఇచ్చిన అర్జీలను నిశితంగా విచారించి అర్హులకు న్యాయం చేస్తామన్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పేదలందరికీ పథకాల లబ్ధి చేకూరేలా అధికారులు, సిబ్బంది పనిచేయాలని సూచించారు. గ్రామ సచివాలయ సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. సచివాలయం ద్వారా అందించే సేవలను నిర్ణీత సమయంలోగా అర్జీదారులకు అందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు విధిగా అందించడంతో పాటు సచివాలయానికి వచ్చే ప్రజలకు జవాబుదారీగా పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలు కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించి అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఇంటిపన్ను వసూళ్లు వేగవంతం చేసి ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రజలకు అందించే సేవల్లో అలసత్వం వహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఈఓఆర్డీ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న సీనియర్ న్యాయవాది భానుప్రకాష్

చీరాల రూరల్: నూతనంగా ప్రవేశపెట్టిన కొత్త క్రిమినల్ న్యాయ చట్టాలపై జూనియర్ న్యాయవాదులు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ న్యాయవాది కరవది భాను ప్రకాష్ అన్నారు. స్థానిక బార్ అసోసియేషన్ హాలులో సోమవారం నూతన క్రిమినల్ చట్టాలపై బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. కొత్తగా ప్రాక్టీస్ చేస్తున్న జూనియర్ న్యాయవాదులు ముందుగా కోర్టు ప్రొసీజర్స్ గురించి తెలుసుకోవాలని సూచించారు. కోర్టులో ఎటువంటి కేసులు విచారణ జరుగుతున్నాయనే విషయాలను కూలంకషంగా తెలుసుకోవాలని సూచించారు. రిమాండ్‌లో ఉన్న ఖైదీలకు బెయిల్ ఏ విధంగా వేయాలి, కోర్టులో కేసులు ఏవిధంగా ట్రైల్ చేయాలనే విషయాలపై న్యాయవాదులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా కొత్త క్రిమినల్ న్యాయ చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. వృత్తిపట్ల అంకిత భావంతో నిజాయితీగా పనిచేసి కక్షిదారులకు న్యాయ సహాయం అందించాలని సూచించారు. సదస్సులో అధ్యక్ష, ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, బోయిన శ్రీనివాసులు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ బొడ్డు రుద్రకుమార్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

అంజిరెడ్డి భౌతికకాయానికి నివాళి



అంజిరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న గాదె మధుసూదన్‌రెడ్డి

ఇంకొల్లు(చినగంజాం): ఇంకొల్లు మండలం గంగవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గుత్తికొండ అంజిరెడ్డి(80) సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే వైఎస్సార్ సీపీ నియోజక వర్గ సమన్వయకర్త గాదె మధూసూదనరెడ్డి ఆయన గృహానికి వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించారు. పార్టీ మండల కన్వీనర్ బండారు ప్రభాకరరావు, ఎంపీటీసీ రాజగోపాల్‌రెడ్డి, బెల్లం సుధాకర్, బిల్లాలి డేవిడ్, ఇతర నాయకులు పాల్గొన్నారు. అదే విధంగా కార్యకర్త మేకల సుదర్శన్ రెడ్డిని పరామర్శించారు. సుదర్శన్‌రెడ్డికు ఆపరేషన్ జరగడంతో ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ సెల్ కార్యదర్శి బిల్లాలి డేవిడ్, కోటి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాధమ్మ జయంతోత్సవం



పూనూరులోని రాధమ్మ జయంతి ఉత్సవాలు

యద్దనపూడి: మండలంలోని పూనూరులోని శ్రీరామకృష్ణ ధ్యానమందిరం వ్యవస్థాపకురాలు మాతృశ్రీ అప్పిచర్ల రాధమ్మ 80 వ జయంతి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. రాధమ్మజయంతి, వసంతపంచమి సందర్భంగా ధ్యానమందిరంలో కొలువైన త్రిపురసుందరి దేవి, గాయత్రిదేవికి అభిషేకాలు, అర్చనలు, శ్రీచక్ర విశేష ద్రవ్యాలతో అభిషేకాలు, లలిత సహస్రనామ పారాయణ, కుంకుమార్చనలు, గాయత్రి, చండీ హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అప్పిచర్ల రామాంజి, మణిప్రసాద్, నిర్వాహకులు కొర్రపాటి ప్రసన్న, యల్లా ప్రగడ అంజిబాబు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మార్టూరు: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు గాయపడ్డాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి మార్టూరులో జరిగింది. వివరాల్లోకి వెళితే..ఒడిశా రాష్ట్రానికి చెందిన బి. రాజేష్ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని షేక్ రఫీకి చెందిన సైకిల్ షాపులో పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో రాజేష్ బైకుపై సర్వీస్ రోడ్డులో సెంటర్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో అదే మార్గంలో వెనుక నుంచి బైక్‌పై వస్తున్న శ్రీనివాసరావు అనే వ్యక్తి రాజేష్‌ను ఢీకొట్టి వెళ్లిపోయాడు. ప్రమాదంలో ఎడమకాలు విరిగిన రాజేష్‌ను షాప్ యజమాని రఫీ మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజేష్ను పరీక్షించిన వైద్యులు మోకాలు విరిగినట్లు తెలపడంతో మెరుగైన చికిత్స నిమిత్తం చిలకలూరిపేట ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఏఎస్సై మహబూబ్ బాషా మార్టూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చి రాజేష్ ఇచ్చిన సమాచారంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

అద్దంకి: కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో కొరిశపాడు మండలంలోని తమ్మవరం గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో కీళ్ల, నరాలు, కళ్లు, గుండె, గ్యాస్ ట్రబుల్, ఇతర వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు.